పుత్రా.....

డా. శోభన్ బాబు బొలుగాని

PUTRAA.....
Telugu Poetry in Kanda Padyaas By
Dr.SHOBHANBABU BOLUGANI

6 December, 2025

ISBN : 978-93-5619-105-1

e-book released by

Dr.SHOBHANBABU BOLUGANI
S/O PITCHAIAH BOLUGANI
Peddamupparam
Danthalapalle
Mahabubabad
Telangana State,India
506324

bsb271@gmail.com
Mobile: +919701181271

అమ్మతనం కోసం పరితపించే
అమ్మల
నాన్నతనం కోసం నిరీక్షించే
నాన్నల
వేదనా శకలాల సమాహారం.....

పుత్రా.......

"అమ్మా! ఓ శ్రీమాతా !
నమ్మితి నిన్నే గదమ్మ మనమున, సంతా
నమ్మీయగ దయతో రా
వమ్మా" యని వేడె యమ్మ వరమగు పుత్రా 1

అమ్మలను గన్న యమ్మవు
అమ్మయ్యే భాగ్యమివ్వ మనుచును నిత్యం
నమ్మకము తోడ పూజలు
నెమ్మనమున మానదమ్మ నినుగన పుత్రా 2

వచ్చినది డేటు అమ్మకు
వచ్చెను కన్నీళ్లు కూడ వరదలు గాగన్
హెచ్చినవి డేటు భయములు
పిచ్చోళ్ళము కాక మునుపె ప్రియమగు పుత్రా 3

ఉన్నదొ లేనిదొ తినుదుము
కన్నా నిను గన్న చాలు కన్నుల నిండన్
ఎన్నడొ మరి నీ రాకయు
కన్నార్పక చూచుచుంటి గదరా పుత్రా 4

పుత్రా.......

పుట్టుమురా నా కడుపున
పుట్టెద మరు జన్మలోన పట్టిగ నీకున్
ఒట్టు సుమీ నా మీదను
నట్టింటను తిరుగుమయ్య నవ్వదు పుత్రా 5

తలవని నామము లేదే
గొలువని దైవంబు లేదు గనుటకు నిన్నున్
తల వంచని బతుకిచ్చెద
తలవంపులు తేకు మాకు తగదుర పుత్రా 6

మ్రొక్కని దేవుడు లేదుర
యెక్కని గుడి మెట్లు లేవు యెన్నాళ్ళుగనో !
మ్రొక్కని డాక్టరు లేదుర
చక్కని నీ మోము చూడ సొక్కితి పుత్రా 7

విద్యా బుద్ధులు నేర్పుదు
గద్యము,పద్యాలలోని గరిమలనిత్తున్
బుద్ధిగ చదివించెద శ్రీ
విద్యా పరిచయమొనర్తు వినరా పుత్రా 8

బోధనలెన్నో వింటూ
బాధల కొలువైన దమ్మ బంధులగూడన్
వేదన గుండెల నిండా
రోదనమెపుడాపునంట రారా పుత్రా 9

ఓ నా ముద్దుల కొడుకా !
ఓ నా బంగారు కొండ ! ఓ జో హితుడా !
ఓ నా వరాల మూటని
నానా విధముల బిలువగ నలుగకు పుత్రా 10

చెప్పెడి వారే కలరిల
గొప్పోళ్ళట చూడ వారు కొడుకుల తోడన్
చిప్పులు దొబ్బెను మాకిక
తప్పక జన్మించవయ్య తగనా పుత్రా 11

గణములు పేర్చుట తప్పితె
గుణ రీత్యాదులనెరుంగ గుణశీలుడవో !
రణమేలా మాపై? కా
రణ జన్మండగుట కొరకు రారా పుత్రా 12

పుత్రా.......

పుట్టుట చచ్చుట కొరకని
గట్టిగ వగచుట దగదుర గుండెయు గలదా !?
పుట్ట గతులు మాకుండవు
పుట్టెడు బుద్ధులు చెబుదుము పుట్టుము పుత్రా 13

ఒకపరి తల్లినవుదు, వే
రొకపరి తండ్రిని యగుదును యక్కర కొద్దిన్
ఒకటే గద యిరువురి మది
రకరకములు కంద శోక రసములు పుత్రా 14

చిక్కినది అమ్మ దేహము
దక్కుదువని మందులెన్నొ తప్పక మ్రింగున్
లెక్కే చేయదు ప్రాణము
నిక్కము దయ యేల లేదు నీకో పుత్రా 15

సంచులు ఖాళీ యగుచున్
సంచులు నిండెను మెడిసిను సంశయమేలా !
సంచిత కర్మమొ? గర్భపు
సంచిన కొలువుండుమయ్య శరణో పుత్రా 16

పుత్రా.......

వద్దుర మాకీ బతుకులు
నిద్దుర కరువయ్యె నమ్మి నెలసరి మొదలై
పొద్దు యెలా గడచునొ మరి
పొద్దులు నిండు వరకుండు ప్రశ్నలు పుత్రా 17.

“అడిగే దొకటే వరమును
యడిగిన కాదనకు దుర్గ యమలిన భక్తిన్
విడుతుము ప్రాణములైనను
కొడుకొక్కడు చాలు”నంటి ఘనుడగు పుత్రా 18

నేడీ సమాజమందున
బిడ్డల గనకున్న దొడ్డ విషయము, విషమౌ
యేడనొ కద నీ జాడయు
తేడా గాడందురు నను తెలియుము పుత్రా 19

తొమ్మిది యేడులు గడిచెను
నెమ్మదిగా వయసు కూడ నెరయగుచుండెన్
నమ్ముర నలభై చేరితి
నిమ్మకు నీరెత్తినట్లు నీల్గకు పుత్రా 20

క్రతువులు చేసితిమెన్నో
బ్రతుకులు బరువయ్యె నయ్య బాపుము బాధల్
ఋతువులు గడచినవెన్నో
ఋతువొక్కటి రాక యున్న నీవో పుత్రా 21

ఏ శాస్త్రము చదివెదవో,
యాశాస్త్రము నాదరింతు నాత్మ విచారా !
ఆశలు కన్నీరై గ
ర్భాశయ పుటనాశ్రయించె రారా పుత్రా 22

పుట్టెడు బుద్ధులు నీకని
పట్టిగ నినుజూసి మురియు భాగ్యము యెపుడో !
పుట్టెడు బుద్ధులు కలుగగ
గట్టిగ దీవించినాను గనపడు పుత్రా 23

అమ్మను చేసిన ఘనుడవు
కమ్మని కందము రచింప గలిగితి నెటులో !
నమ్ముదు నీ వొస్తావని
జిమ్మా నను తండ్రి దాత జేయవె పుత్రా 24

పుత్రా.......

ఇజ్జగము చాల చెడ్డది
దర్జాగా బతకలేను దరిసెనమెపుడో
మజ్జా తోడుండుమురా
కొజ్జాగాడందురేమొ గలుగుము పుత్రా 25

పెద్దమ్మలు పెదనాన్నలు
ముద్దులనిట మూటగట్టి మురిపెము తోడన్
బుద్ధిగ నిను చదివింతురు
దిద్దింతురు “ఓం నమః”లు దెలియుము పుత్రా 26

మందో మాకో తిందుము
ముందర నీవున్న చాలు మోదము గలుగున్
కందుము నిను కడుపారా
విందుము నీ మాటలెప్డు విడువకు పుత్రా 27

పుట్టక ముందే కొడుకని
యెట్టుల నిను బిల్చినానొ యెరుగను మది లోన్
తిట్టకురా మమ్మునెపుడు
నెట్టింటను వైరలవ్వ నేర్పుదు పుత్రా 28

పుత్రా.......

నిరతము ఆంక్షలు మోపము
చరవాణిని వీడుమంచు జపలత బుద్ధిన్
ఇరువురి ప్రేమలు ముడిపడ
గురుతుగ నీవుండ వేల గలుగుము పుత్రా 29

ఏ స్కానింగుల జిక్కక
మస్కా గొట్టంగ నేర్చు మాయల మారీ
ఆస్కారివ్వగ వచ్చును
నీ స్కాముల నాపుమింక నీవే పుత్రా 30

అరువది నాలుగు మాత్రలు
అరువది నాలుగు కళలుగ నగపడు నిచటే
నరయగ కందము నందున
మెరయగ కొలువుంటివయ్య మేలగు పుత్రా 31

కట్నము లీయగ లేనో !
కోట్లకు పడగెత్తి లేనొ ! కటకట మరి యే
కొట్లాటల తల దూర్చనొ ?
పుట్టుము దిగులింక లేదు పులి వలె పుత్రా 32

పుత్రా.......

అడిగినవన్నీ యిత్తును
అడుగులకున్ మడుగులొత్తు దన్నియు వేళల్
బడి ఫీజులు కట్టగలను
కడు తలపుల వేట వద్దు గలుగవె పుత్రా 33

అప్పులు చేసితి నెన్నో
తప్పనిసరి యాసుపత్రి దారుల బత్తెం
ఇప్పుడు వేలకు లక్షలు
నిప్పుల కొలిమయ్యె జన్మ నీరగు పుత్రా 34

అప్పులు తెచ్చెను తాతయు
అప్పుడపుడు, అప్పనంగ రావని తెలుసో !
గొప్పదిరా తన మనసుయు
అప్పను నను చేయ దలిచె నరయవె పుత్రా 35

ఐయూఐ, ఐవీఎఫ్
ఆయా పద్ధతుల వల్ల నొచ్చెదవేమో !
మోయాలి రా సహజముగ
నీ యాటలు చాలునయ్య నిలువుము పుత్రా 36

పుత్రా.......

మనసారా నిను జూడని
కనులెందుకు కల్ల బొల్లి కవితలు యేలో?
నిను మోయని కడుపెందుకు
కని పెంచని జన్మమేల గలుగుము పుత్రా 37

నిను పిలువని నోరెందుకు
నిను కోరని కోర్కెయేల నిజమిది యరయన్
వినువీధిని చూపిస్తూ
తినిపించని చేతులేల దెలియుము పుత్రా 38

నిను మోయని భుజమెందుకు
నిను తలవని మనసదేల నిగ్రహమెరుగన్
నిను తాకని కరమెందుకు
నిను గనని తనువిది యేల నెరుగుము పుత్రా 39

నేడే మా కడుపున బడు
వేడెద పలుమార్లు నిన్ను విసుగే లేకన్
మోడయ్యే ను మా బతుకులు
తోడై చిగురించరావె దరువై పుత్రా 40

కందము రాసే దెందుకు
అందించగ నార్తి విశ్వ మా మోదింపన్
పొందాలని నీ క రుణము
కందామని కన్నులార గలుగుము పుత్రా 41

కమ్మని పద్యము లెన్నో
చిమ్ముట లేదీ కలంబు, జీవుడు నీవై
దమ్మును నాలో పెంచుము
ఇమ్మర గని పెంచు భాగ్యమిమ్ముగ పుత్రా 42

నీవే మా మంత్రమురా
నీవే మా తంత్రమయ్యి నిల రావేలన్
నీవే మా యంత్రము రా
మావైభవ సాగరమీద నావై పుత్రా 43

చేయని తప్పుకు నిందలు
మోయుదుమిల యుత్తమోత్తమ గతుల కొరకున్
మాయని మచ్చలివి నిను
మోయుట కన్నా బరువగు మరువకు పుత్రా 44

పుత్రా.......

ఇప్పటికి యేడు మారులు
తప్పించుక తిరిగినావు తల్లి కడుపునన్
నొప్పులు భరించలేదో
ముప్పొద్దులు సేవలొంద రారా పుత్రా 45

ఎందరు పిల్లలు నీకని
ముందుగ నడుగరె జనులభిమానము చేతన్
ఎందుకు లేదో నీకిక
తొందర, వయసుడిగి తొలచు దయ గల పుత్రా 46

ఊయల లూపగ నిన్నున్
హాయిగ నిదురించ రాగ మారామేలో
కోయిల కూతలు తోడై
కాయితముల నిండ వెలుగు కవితై పుత్రా 47

గుండెను పానుపు జేసెద
గండములవి యెన్ని యున్న గడతేర్చెద మా
కండగ నుండగ రారా
గుండియలను యేలు వాడు గారా పుత్రా 48

పుత్రా.......

విరహము మాటే యెరుగము
నిరతము నీ ధ్యాస లోన నిలుచుట చేతన్
సురలము గాముర నరులము
కొరివిని పెట్టకు తలకికక కోరుదు పుత్రా 49

ఈ పాపము యే జన్మదొ
"నీ పాపల ఎపుడు చూతు" నైరాశ్యముతో
పాపము నీ జేజమ్మయు
"ఈ పాపపు కళ్ళ తోడ" నేడ్చెను పుత్రా 50

ఏ శాపము తగిలినదో
మా శోకము తీరుటెట్లు మౌనమె మిగిలెన్
ఆశా వర్కరు ఫోనులు
పాశుపతాస్త్రమ్ములయ్యె బలుకగు పుత్రా 51

పుట్టక ముందే నీకున్
కట్టితి గర్భాలయమ్ము కొలువై వుండన్
పుట్టక పోతే జగమున
పట్టుమని యిక పది నాళ్ళు బతుకను పుత్రా 52

ఎంతగ సంపాదించిన
సొంతము సుఖమేది లేదు సొంతమె యితరుల్
చింతలు తీర్చగ రారా
గంతలు గలవా కనులకు గాంచుము పుత్రా 53

పొట్టలు యెవరివి ఎప్పుడు
గొట్టనయితి మాదు పొట్ట గొట్టుట తగునా ?
పెట్టెదము పట్టెదన్నము
పట్టుపరుపు లివ్వకున్న బుట్టుము పుత్రా 54

మా ఊపిరి నీ వే రా
మా వినతిని యాలకించి మమ్మేలుమురా
నీ ఊపిరి మేం కాగా
మావిన కొలువుండి రమ్ము మరువకు పుత్రా 55

పరిణయమగు నాడు మొదలు
సురతములవి యెన్నియైన శూన్యములగుచున్
పెరిగెను దైన్యపు జాడలు
చెర సాలయొ నాడు కడుపు ? చేరుము పుత్రా 56

పుత్రా.......

పిండము లోపల తన్నుచు
నుండగ పులకించని తను వుండునె నీకో
దండము రా నాయన మా
కండలు కరుగంగ నిన్ను గాతుము పుత్రా 57

అందము తరిగిన కానీ
అందింతును పాల రొమ్ము నానందముగన్
చిందులు వేయగనింటను
రందులు మటుమాయమగును రయమున పుత్రా 58

నెత్తురు ముద్దగ నిన్నున్
పొత్తిళ్ళలో హత్తుకొనుచు పరవశమొందన్
ఎత్తుకొనెడు కాలమెపుడొ ?
మెత్తని మనసుండునట్లు మెలగుము పుత్రా 59

వ్యసనమ్ములు వదిలేసితి
పొసగని పని పాటలింక పాతర పెడితిన్
కసి యేలా నా మీదను
విసిగితి వేసారితేను వీరుడ పుత్రా 60

పుత్రా.......

కారణ మేమో తెలియదు
నీ రాకకు నాలస్యము నే నెరుగనురా
చేరాతలు చెరిపేయగ
పోరాడుమ బ్రహ్మ తోడ పరువగు పుత్రా 61

వసి వాడని పసి వాడుగ
ముసి ముసి నవ్వులను రువ్వ మారుత మేనున్
ముసిరిన చీకట్లు తొలగ
మసలుమ మన యింటి దీప మవరా పుత్రా 62

నేరాలనేమి చేస్తినా
ఘోరాలను అడ్డు కొనక కూర్చుంటినా భూ
భారమ్మే పెరిగినదో
నే రాలుదు నీవు లేక నిజముగ పుత్రా 63

ఆకాశ మంత ప్రేమను
లోకమునకు పంచి పెట్టు రచనలు చేయన్
లోకోత్తర ప్రతిభుడవై
నాకోసము వాక్యమవర నాల్కన పుత్రా 64

పుత్రా.......

ఆత్మను కద నేగూడా
ఆత్మజుడవు యేల గావు యర్థమె గాదే
ఆత్మారాముడగుచు కవి
తాత్మగ విధి నిర్వహింప తల చితి పుత్రా 65

అడవులకు నిన్ను పంపను
దుడుకుతనము దుంచనెంచి తల నరకనురా
కడు ప్రీతిన్ రణమివ్వను
చెడి యంగడి విక్రయింప చేరుము పుత్రా 66

అల్లిక జిగిబిగి నెరుగను
కల్లలు పలుకుట నెరుగను కల్పనలెరుగన్
యిల్లులు గూల్చుట నెరుగను
చిల్లర పనులంటు నెరుగ జెల్లనొ పుత్రా 67

డాక్టరవుదువో సినిమా
యాక్టరవుదొ యింజనీరువవుదో సే వన్
డిక్టేటరగుదువొ మరి క
లెక్టరవుదొ చేయగలమొ లేదో పుత్రా 68

పుత్రా.......

మము గావుము నిను వేడితి
నమంగళపు శబ్దమేది యమ్మకు యిడకన్
సమతా మమతల నెలవై
తమి దీరగ బుట్టుమయ్య తడయక పుత్రా 69

ఇంతటితో చాలింతును
వింతగ నిట యింటి గుట్టు విప్పిన ఘనుడా
పంతము లేలా మాపై
ఇంతింతలు తల్లిదండ్రులిడుములు పుత్రా 70

అంతయు మన మంచికె యని
ఇంతయు కాలంబు వేచి చూశామయ్యా
అంతము లేదో వ్యథలకు
గంతకు తగ బొంతవిపుడు గాకుము పుత్రా 71

భూదేవి యంత సహనము
సాధించగ చుట్టి యుందు సాగరమవుదున్
యేదో వొక నాడు కలుగ
నీదు చరిత వృద్ధినొందు నీ స్వర కృపచేన్ 72

కవి పరిచయం



పూర్తి పేరు : శోభన్‌బాబు బొలుగాని

జన్మస్థలం : పెద్దముప్పారం గ్రామం,
దంతాలపల్లి మండలం,
మహబూబాబాద్ జిల్లా.

తల్లిదండ్రులు : శ్రీమతి అనసూర్య,
కీ.శే. శ్రీ పిచ్చయ్య

చదువు : హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుండి M.A.(2011–13),
M.Phil.(2014), Ph.D.(2020)

వృత్తి : తెలుగు లెక్చరర్ (డిగ్రీ)

పరిశోధన : *సుధాకర కవితాజ్యోత్స్న– ఒక పరిశీలన*
(M.Phil.Thesis.అముద్రితం)
నల్లదీగ శ్రీనివాసాచార్యుల కట్టబ్రహ్మన చరిత్ర–కావ్యానుశీలన
(Ph.D.Thesis.అముద్రితం)

కవిత్వం : త్వరలో పుస్తక రూపంలో రానున్న రచనలు

1. *ఒక నేను – ఒక తను* (వచన కవితలు)
2. *ఆశల దారాలు* (వచన కవితలు)
3. క్లుప్తంగానీకాలం (నానీలు)
4. *శోభి కూనలమ్మ పదాలు*
5. వెలుతురు ఖడ్గం (హైకూ e-book 2024)
6. హైకూలహరి (హైకూ)
7. చూపుల వేట (హైకూ)